ప్రజాశక్తి

గురువారం 5 జూన్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

తల్లికి వందనంపై తొలగని అయోమయం

అధికారులకు విడుదల కాని మార్గదర్శకాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠశాలలు పున:ప్రారంభం అయ్యేలోగానే తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పున: ప్రారంభం కానున్నాయి. పాఠశాలలు తెరిచే సమయానికి కల్లా తల్లివందనం నిధులను తల్లుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు ఇంత వరకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. గత ప్రభుత్వంలో ఉన్న మార్గదర్శకాలను కొంత మంది సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారే తప్ప ఎటువంటి విధి విధానాలు రాలేదని అధికార వర్గాలు తెలిపాయి. బుధవారం జరిగే మంత్రి వర్గ సమావేశంలో విధి విధానాలు ఖరారు చేస్తారని గత రెండు రోజులుగా ప్రచారం జరుగుతున్నా ఈ అంశంపై ఎటువంటి ప్రకటన రాలేదు. దీంతో పాఠశాలలు తెరిచిన తరువాతనే ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. గతేడాది ఈ పథకం అమలు కాలేదు. గత ఏడాది జూన్ 12న కొలువుతీరిన కూటమి ప్రభుత్వం పలు మార్లు వాయిదా వేస్తూ వచ్చారు. అయితే చివరికి పాఠశాలలు తెరిచే నాటికి ఈపథకం



అమలు చేస్తామని గత అసెంబ్లీ సమావేశాల్లో, ఇటీవల కడప మహానాడులో కూడా సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూశారు. సోషల్ మీడియాలో వస్తున్న విభిన్నరకాల సమాచారం ఆధారంగా

తల్లిదండ్రులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అలాగే అధికారులను, పాఠశాలల నిర్వహకులను సంప్రదించగా తమకు ఎటువంటి సమాచారం రాలేదంటున్నారు. గత ప్రభుత్వ హయంలో కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా ఒక్కరికే అవకాశం కల్పించారు. వైసిపి ప్రభుత్వం హయంలో ఉమ్మడి జిల్లాలో 4.88 లక్షల మంది విద్యార్థులకు అమ్మఒడి పథకం వర్తింప చేశారు. ఐదేళ్ల కాలంలో ఈ సంఖ్య కొంత మేరకు తగ్గుతూ వచ్చింది. చివరి సంవత్సరం 4.30లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు చొప్పున జమ అయ్యాయి. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో ఈ ఏడాది మొత్తం 5.71 లక్షల మంది నమోదు అయ్యారు. వీరందరికి రూ.15 వేలు చొప్పున ఇస్తారా? లేక ఇంటికి ఒక్కరికే ఇస్తారా అన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కుటుంబంలో ఒక్కరికే అయితే 4.50 లక్షల మంది లబ్ధిదారులు ఉండవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో అమ్మఒడి పథకానికి పాఠశాలల నుంచే దరఖాస్తులను విద్యాశాఖ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో పంపేవారు. రేషన్ కార్డు, తల్లి, పిల్లల ఆధార్ కార్డు, పాఠశాలల వారు విద్యార్థికి 75 శాతం హాజరు ఉన్నట్టుగా ధృవీకరణపత్రం, తల్లి బ్యాంకు పాసు పుస్తకం మాత్రమే తీసుకుని అప్‌లోడ్ చేసే వారు. కానీ ఈ సారి దరఖాస్తులు ఎక్కడ దరఖాస్తు చేయాలన్నదీ ఇంకా మార్గదర్శకాలు రాలేదు. దీంతో ఇప్పట్లో ఈ పథకం ప్రారంభం అయ్యే అవకాశం కన్పించడం లేదు. ఈ అంశంపై జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుకను వివరణ కోరగా తల్లికి వందనం పథకం అమలుకు సంబంధించి ఇంకా తమకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదన్నారు.

పొగాకు కొనుగోలుపై దృష్టి పెట్టని సర్కార్

రైతుల ఇబ్బందులపై ఉదాశీనం

నేడు గుంటూరులో జిపిఐ కార్యాలయం ఎదుట ధర్నా

హాజరు కానున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పొగాకు ధరలు పడిపోయి రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. రైతులకు ధరలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిఎం అధికారులకు ఆదేశించినా క్షేత్రస్థాయిలో ఎటువంటి స్పందన లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పొగాకు సాగు చేసిన రైతు, కౌలు రైతులు ఇబ్బందులపై జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు స్పందన నామ మాత్రంగానే ఉంది. అధికారులు, వ్యాపారులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి ఇంత వరకు ఎటువంటి కార్యచరణ చేపట్టడం లేదు. వ్యాపారుల అంగీకారం తెలపడం వల్లే తాము పొగాకు సాగు చేశామని తీరా దిగుబడి వచ్చిన తరువాత వ్యాపారులు ముఖం చాటేశారని జిల్లాలోని బర్లీ పొగాకు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది క్వింటాలుకు రూ. 20 వేల వరకు కొనుగోలు చేసిన పొగాకును ఈ ఏడాది కొనుగోలే చేయమని కంపెనీలు భీష్మించుకుని ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా యంత్రాంగంలో ఎటువంటి చలనం లేదు. పండిన పంటను ఎక్కడ దాచి పెట్టాలో అర్థం కాక వర్షాలకు తడిచిపోయి నాణ్యత తగ్గిపోతుందని రైతులు ఆందోళనగా ఉన్నారు. ఉత్పత్తికి గ్యారంటీ ఇస్తూ బాండ్ల ఇచ్చిన కంపెనీలు మాత్రం మొక్కుబడిగా గతం కంటే తక్కువ రేట్ కి కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలో మూడున్నర లక్షల పైగా ఎగరాలు పొగాకు సాగు చేయగా ఉమ్మడి జిల్లాలో

2లో



పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు

హామీలు విస్మరించి ప్రజలకు వెన్నుపోటు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వైసిపి నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చనందుకు నిరసనగా బుధవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెన్నుపోటు దినం పాటించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం ప్రమాణస్వీకారం చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరుస్తామని చెప్పి విస్మరించడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. నలభై సంవత్సరాల అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన గాలికి వదిలేశారని తెలిపారు. ఎన్నికల హామీలకు సంబంధించి 143 హామీలను విస్మరించారన్నారు. కూటమి నేతలు వేలకోట్ల దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఈ పాలన గురించి చెప్పేందుకే ఈ వెన్నుపోటు దినం కార్యక్రమం చేపట్టామన్నారు.

2లో

'గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు తీర్పు - రాష్ట్రపతి రిఫరెన్స్ ఆర్టికల్ - సమాఖ్య వ్యవస్థపై దాడి' అంశంపై

ఐలు ఆధ్వర్యంలో నేడు విజయవాడలో సదస్సు

హాజరుకానున్న ఎంపి, సుప్రీం న్యాయవాది రంజన్ భట్టాచార్య

ప్రజాశక్తి - విజయవాడ

"గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు తీర్పు - రాష్ట్రపతి రిఫరెన్స్ ఆర్టికల్ 143 (1) సమాఖ్య వ్యవస్థపై దాడి" అంశంపై గురువారం సాయంత్రం 6 గంటలకు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సదస్సు జరుగుతుంది. విజయవాడ బాలోత్సవ భవన్లో జరిగే ఈ సదస్సులో ముఖ్య వక్తగా రాజ్యసభ సభ్యులు, డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది, ఐలు జాతీయ అధ్యక్షులు బికాస్ రంజన్ భట్టాచార్య, వక్తలుగా విట్ లా స్కూల్ డీన్ చెక్క బెనర్జి, మాజీ పిడిఎఫ్ ఎంఎల్సి కె.ఎస్.లక్ష్మణరావు, వి.డి.సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ పి.దివా కర్ బాబు, ఐలు ఏపి రాష్ట్ర అధ్యక్షులు కె.విజయ్ కుమార్ పాల్గొంటారు. ఐలు జాతీ య కార్యనిర్వాహక అధ్యక్షులు, ఏపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహిస్తారు.

కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను ప్రారంభించాలి : ఎస్ఎఫ్ఐ

8లో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎడిసి ఛైర్ పర్సన్ లక్ష్మీ పార్థ సారధి,సి ఆర్ డి ఎ కమీషనర్ కన్నబాబు తదితరులు

నేడు రాజధానిలో వనమహోత్సవం

హాజరు కానున్న సిఎం, డిప్యూటీ సిఎం

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ,ఎడిసి ఛైర్ పర్సన్ లక్ష్మీ పార్థసారధి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలంలో గురువారం వన మహోత్సవం జరగనుంది. ఉదయం 10.30 గంటలకు అనంతవరం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మొక్కలు నాటనున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమం ఏర్పాట్లను మున్సిపల్ మంత్రి నారాయణ, ఎడిసి ఛైర్ పర్సన్ లక్ష్మీ పార్ధ సారధి బుధవారం రాత్రి పరిశీలించారు. సభా ప్రాంగణ స్థలాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ వన మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మొక్కలు నాటుతారని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా అమరావతి ఉండాలనేది సిఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. దేశంలో ఎక్కడైనా నిర్మాణాలకు 10 శాతం బ్లూ అండ్ గ్రీన్ ఉంటుందని

2లో

నేడు మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సి.రాఘవాచారి మీడియా అకాడమీ రాష్ట్ర చైర్మన్‌గా ఆలపాటి సురేష్ కుమార్ గురువారం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరిస్తారని మీడియా అకాడమీ కార్యదర్శి వి.మణిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ మొగల్రాజపురం రెవెన్యూ కాలనీలో గల అకాడమీ కార్యాలయంలో సురేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

జర్నలిస్టు సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీ రామ్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగర అధ్యక్షులు తాళ్లూరి అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీ రామ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అనేక జీఓలను విడుదల చేసే ప్రభుత్వాలు మీడియా అక్రిడిటేషన్ జీఓ విషయంలో తీవ్ర ఆలస్యం చేస్తూ ఉండటం వల్ల వర్కింగ్ జర్నలిస్టులు అభద్రతా భావానికి గురవుతున్నారని అన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అందరికీ సులభతరంగా అక్రిడేషన్ మంజురు అయ్యేవిధంగా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ, జర్నలిస్టు హెల్త్ కార్డు, సంక్షేమ నిధి తక్షణమే పునరుద్ధదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, ఏపీఎంపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు యేమినేని వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నగర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు, వల్లూరు ప్రసాద్, తిరుమల శెట్టి నాగేశ్వరావు, నాగోతి శ్రీనివాసరావు, ఆర్ కోటేశ్వరరావు, సుంకర సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జొమోటో కార్మికులపై కేసులు వెనక్కి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-విజయవాడ

జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులపై ఇచ్చిన తప్పుడు పోలీసు ఫిర్యాదులను వెనక్కి తీసుకోవాలని, బ్లాక్ చేసిన జొమాటో ఐడి లను తిరిగి పునరుద్ధరించాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. జొమాటో కార్మికులకు పీక్ హావర్స్‌లో పే అవుట్ రూ.15 ఇవ్వాలని, నాన్ పీక్ హావర్స్‌లో రూ.10 ఇవ్వాలని, రెస్టారెంట్ వెయిటింగ్ టైం నిమిషానికి ఒక రూపాయి ఇవ్వాలని, ఆర్డర్స్ టార్గెట్ ను 22 నుండి 18కి తగ్గించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని జొమోటో కంపెనీ ప్రతినిధులతో గత సంవత్సర కాలంగా విన్నవిస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం చేయలేదని, గత్యంతరం లేక గుంటూరులో పనులు నిలుపుదల చేశారని వారికి సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కమిటీ మద్దతు తెలియజేస్తున్నదన్నారు. సమస్యలు పరిష్కారానికై కార్మికులతో చర్చించేందుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు సమస్య పరిష్కరించకపోగా కార్మికులపై తప్పుడు పోలీసు కంప్లైంట్లు ఇచ్చి సమస్యను పెద్దది చేస్తున్నారని విమర్శించారు. వెంటనే జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా జొమోటో కార్మికులు ఆందోళనకు పూనుకుంటారని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించమని నిరసన తెలియజేస్తున్న జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా తప్పుడు కంప్లైంట్ లు ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు. కంపెనీ ప్రతినిధులు కార్మికులు ఇచ్చిన డిమాండ్లను కంపెనీ యాజమాన్యం దష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించకపోగా కార్మికులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వ్యవహరించడం హేయమైన చర్య అన్నారు., వెంటనే కార్మికులపై ఇచ్చిన తప్పుడు పోలీస్ కంప్లైంట్ వెనక్కి తీసుకోవాలని, ఎవరైతే కార్మికుల ఐడీలు బ్లాక్ చేశారో వెంటనే వారి ఐడీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.

హామీలు విస్మరించి ప్రజలకు వెన్నుపోటు

(మొదటి పేజీ తరువాయి)

రానున్న కాలంలో ప్రజలు కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెబుతారని తెలిపారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రసంగిస్తూ ఎన్నికల్లో గెలవడానికి అనేక హామీలు ఇచ్చిన సిఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పట్టించుకోవడం లేదన్నారు. 50 ఏళ్లుదాటిన బిసి,ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీలకు ఫించన్లు ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినం కార్యక్రమం చేపట్టామన్నారు. ఎన్నో వత్తిడులు, పోలీసుల ఆంక్షల మధ్య వెన్నుపోటుపై నిరసన తెలుపుతున్నామన్నారు. తమను రెచ్చగొట్టి అరెస్టు చేయాలని కొందరు పోలీసులు ప్రయత్నం చేసారని తెలిపారు. సంవత్సరం పాలనలో చంద్రబాబు ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన చేయాలనుకోవటం కరెక్ట్ కాదన్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఎక్కువగా ఉంది,అందుకే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చారని తెలిపారు. జిల్లా సమన్వయకర్త పి. మహేష్ అబద్దాలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక హామీలు మరిచి నందుకు ప్రజలు నిరసన తెలిపారన్నారు. ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే కూటమి



ప్రభుత్వం ఏడాదిలో లక్షా 50 వేల కోట్లు అప్పులు చేశారన్నారు. బెల్టు షాపులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా సిఎం చంద్రబాబు ఎందుకు బెల్టు తీయడం లేదన్నారు. వైసిపి నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, జిల్లా నాయకులు నిమ్మకాయల రాజ్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలుపై దృష్టి పెట్టని సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

1.96 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల కంపెనీలు మొఖం చాటేశాయి. ఈ నేపథ్యంలో పొగాకు రైతులకు మద్ధతుగా ఎపి రైతు సంఘం చేస్తున్న ఆందోళనలో భాగంగా గురువారం గుంటూరులోని విద్యానగర్ వద్ద ఉన్న జిపిఐ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్టు రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు కంచుమాటి అజయ్ కుమార్ తెలిపారు. ధర్నాకు వివిధ జిల్లా నుంచి పొగాకు సాగు రైతులు హాజరుకానున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు మాజీ వ్యవసాయశాఖ మాజి మంత్రి వర్యులు ,ఎంపి వడ్డే శోభనాద్రిశ్వరావు వివిధ రైతు సంఘాల రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు హాజరుకానున్నారని తెలిపారు.



ప్రజలను మోసం చేసిన ఎన్డీఏ ప్రభుత్వం

ప్రజాశక్తి -వినుకొండ

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మోసపూరితమైన హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే, వైసిపి పిఎసి సభ్యులు బొల్ల బ్రహ్మనాయుడు అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమాన్ని బ్రహ్మనాయుడు అధ్యక్షతన బుధవారం వినుకొండలో నిర్వహించారు. పార్టీ కార్యాల నుండి బయలుదేరిన వైసీపీ శ్రేణులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ మీదగా శివయ్య స్తూపం, నరసరావుపేట రోడ్డు నుండి తాసిల్దార్ కార్యాలయం వద్దకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఓటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా ప్రజలకు పండగ దినమని మాట్లాడటం ఆశాస్పదంగా ఉందన్నారు. ప్రజలకు చేసిన మోసం రానున్న రోజుల్లో కొట్టం ప్రభుత్వాన్ని దహిస్తాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సురేష్ నాయక్ వినతి పత్రం అందజేశారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ అదెక్కడ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సూపర్ సిక్స్ సహా 143 హామీలతో ప్రజలను నమ్మించి ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిశారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచిన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను వంచించారని కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు బుధవారం వైసిపి చేపట్టిన వెన్నుపోటు దినోత్సవం సందర్భంగా నరసరావుపేట పట్టణం గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయం వద్ద నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కె.మధులత కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలపై వైసిపి ఉద్యమబాట పట్టిందన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రోజు ఓట్లేసిన ప్రజలకు ఏడాది కాలంగా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు.వైసిపి హయాంలో 5 ఏళ్ళ పాలనలో రూ 3 లక్షల కోట్లు అప్పు చేస్తే కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఎటువంటి సంక్షేమ పథకాలు ఇవ్వకుండానే రూ 1.50 లక్షల కోట్లు అప్పు చేశారని విద్యుత్ బిల్లులు పెంచమని చెప్పి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు చేసి అక్రమ కేసులను నిలిపివేయాలి అన్నారు. ఇప్పటికైనా కోటవి ప్రభుత్వం తమ సైలు మార్చుకోకపోతే వైసిపి ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాణా సంచా కాల్చి కూటమి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన మంగళగిరి ఇంచార్జ్ చల్లపల్లి శ్రీనివాసరావు పిలుపుమేరకు ఉండవల్లి సెంటర్లో సాయంత్రం ఏడు గంటలకు బాణాసంచా కాల్చి దీపావళి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ నాయకులు జొన్న రాజేష్ మాట్లాడుతూ రాజధానిని స్మశానంతో పోల్చి .. రాష్ట్ర అభివృద్ధిని చంపేశారని.. స్కాముల మీద స్కాములు చేస్తూ ప్రజాగ్రహానికి గురై 151లో ఐదు పోగొట్టుకుని 11 కి పరిమితం అయ్యారని దుయ్యబట్టారు... అందుకే పీడ విరగడయ్యి నేటికి సంవత్సరం అంటూ చేసుకుంటున్న సంబరాలకు విశేష ఆదరణ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తాడేపల్లి మండల కార్యదర్శి చాముండేశ్వరి దేవి,తెలుగుదేశం నాయకులు దాసరి కృష్ణ, గాదె బసివి రెడ్డి, జనసేన నాయకులు దినేష్ చక్రవర్తి, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, అల్లం నాగమల్లేశ్వరరావు, మేక నాని, నానాజీ, దాసరి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నేడు రాజధానిలో వనమహోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతిలో మాత్రం 30 శాతం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో కనీసం రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సింగపూర్ జపాన్‌తో సంప్రదించి అక్కడి మాదిరిగా మంచి ప్లాంటేషన్ ఉండేలా చూడమని సిఎం ఆదేశించినట్లు చెప్పారు. అధికారులకు సూచనలు చేశారు. పారిశుధ్యం, వాహనాల పార్కింగ్, బారికేడ్ పనులను సజావుగా చేపట్టాలన్నారు. నిరంతర విద్యుత్శక్తి సరఫరా ఉండేటట్టు ట్రాన్స్ కో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం విజయవం తంగా నిర్వహించేదుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, ఎస్పి సతీశ్ కుమార్, ఎంఐడిసి చైర్మన్ డేగల ప్రభాకర్, ఆర్ డి వో శ్రీనివాసరావు, ఫారెస్ట్ కన్జర్వేటర్ రాజు, అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) రవి కుమార్,డి ఎస్ పి మురళికృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ ఎండి నజీమా బేగమ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బసవేశ్వర రావు, సిఐ శ్రీనివాస రావు, తుళ్లూరు, గుంటూరు పశ్చిమ తహశీల్దార్లు సుజాత, వెంకటేశ్వర్లు,ెంవెన్యూ, పోలీస్, పంచాయితీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పనులు వేగవంతం..

వన మహోత్సవం నిర్వహణకు అవసరమైన పనులను అధికారులు వేగవంతం చేశారు.సభా ప్రాంగణానికి చేరుకునే మార్గంలో పరిశుభ్రతకు చర్యలు చేపట్టారు.పారిశుధ్య కార్మికులు రహదారులకు ఇరువైపులా చెత్తా చెదారం ను వాహనాలలో తరలిస్తున్నారు.సభా ప్రాంగణం దగ్గర నేలను జెసిబి లతో చదును చేస్తున్నారు.ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన వివిధ మొక్కలను నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.కొన్ని చోట్ల రోడ్లను మరమ్మతులు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల అద్దంకి నార్కెట్ పల్లి జాతీయ రహదారిపై విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం వాటిల్లిన రోడ్డు ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం హైదరాబాద్ నుంచి ఒంగోలు సమీపంలో గల కందుకూరు వైపు వెళుతున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు నుండి కొందరు ప్రయాణికులను దించేందుకు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆగింది. ఈ క్రమంలో వెనుక వైపు నుండి వేగంగా వస్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి ఆగి ఉన్న బస్సును ఢీకొని బస్సు ముందు వైపుకు వచ్చి నిలిచిపోయింది. బస్సు వెనుక భాగం దెబ్బతినడంతో ఇరు వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. ఇదే క్రమంలో ఒంగోలు వైపు వెళ్ళుతున్న మరో ఆర్టీసీ సూపర్ లగ్జరి బస్సులో ఆగి ఉన్న బస్సులో నుండి ప్రయాణీకులను ఈ బస్సులోకి ఎక్కిస్తున్నారు. ఈ క్రమంలో హైవే రోడ్డు పై వేగంగా వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి అక్కడ ఆగి ఉన్న కంటైనర్ లారీ ఢీకొనడంతో బస్సులోకి దిగి మరొక బస్సులోకి ఎక్కడానికి వెళుతున్న బెల్లంకొండ మాధవరావు (40)ను కంటైనర్ లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. కాగా మృతుడు ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గం పరిధిలో గల గుడ్లూరు మండలం మిట్టపాలెం గ్రామానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని నరసరావుపేట రూరల్ సిఐ రామకఅష్ణ, ఎస్.ఐ సి హెచ్ మణికఅష్ణ పరిశీలించారు. రోడ్డు ప్రమాదం జరిగి ఢీకొని ఇరుక్కొని ఉన్న కంటైనర్, బస్సులను క్రేన్ సహాయంతో బయటకు తీయించారు. హైవే రోడ్డు పై చెల్లాచెదురుగా పడిపోయి, పగిలిపోయిన వాహనాల అద్దాలను శుభ్రం చేయించి, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తము నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను పోలీసు స్టేషన్ కు తీసుకెళ్ళారు. కాగా మఅతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ మణికృష్ణ తెలిపారు.



మృతి చెందిన మాధవరావు



రోడ్డు ప్రమాదంతో నుజ్జునుజ్జు అయిన బస్సు



రాగి జావ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

రాగి జావతో శరీరానికి శక్తి

ప్రజాశక్తి - పెదకూరపాడు

రాగి జావ శరీరానికి శక్తినిస్తుందని రాగులు చల్లని లక్షణాలు కలిగి ఉండి శరీరంలోని వేడిని తగ్గిస్తాయని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు అన్నారు. జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు జన్మదిన సందర్భంగా రాగి పిండి, బెల్లం, పాలు, జీడిపప్పుతో కలిపిన రాగిజావతో పాటు,రాగి పిండి, మజ్జిగతో తయారు చేసిన రాగిజావను బుధవారం పంపిణీ చేశారు. భాష్యం ఆంజనేయులు మాట్లాడుతూ జన చైతన్య సమితి చేస్తున్న సేవలు అభినందనీయ మన్నారు. జన చైతన్య సమితి కార్యదర్శి తల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు చేతనందిస్తున్న పూర్ణచందర్రావు ఆదర్శనీయులన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి - బుడుగు జంగాలు, ఎస్సీలు

ప్రజాశక్తి -దుర్గి

చందనా బ్రదర్స్ యాజమాన్యం లాక్కున్న భూములను తమకు ఇప్పించాలని బుడుగు జంగాలు, ఎస్సీలు బుధవారం తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ఫణీంద కుమార్ చందనా బ్రదర్స్ యాజమాన్యాన్ని బుడుగు జంగాలు ఎస్సీ నాయకులను తమ కార్యాలయానికి పిలిపించుకొని చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు చందనా బ్రదర్స్ యాజమాన్యాన్ని తహశీల్దార్ వివరణ కోరారు. బుడుగు జంగాలు ఎస్సీ నాయకులు మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో భూమి కొనుగోలు పథకం కింద 59 మందికి పాస్ పుస్తకాలు పట్టాలు ఇచ్చారని నాయకులు తెలిపారు. విషయం తెలుసుకున్న చందనా బ్రదర్స్ యాజమాన్యం 2009లో 139 ఎకరాల భూమిపై కోర్టులో వ్యాజ్యం వేసామని చందనా బ్రదర్స్ యాజమాన్యం తెలిపారు. 2023లో కోర్టు మాకు అనుకూలంగా తీర్పు చెప్పిందని తెలిపారు. అందుకే బుడుగు జంగాలు ఎస్సీ ప్రజలను స్థలాల వద్దకు రావద్దని వారిని అడ్డగించడం జరిగిందన్నారు. ఇరువురి వాదనలు విన్న తహశీల్దార్ మీ వాదనలు రాతపూర్వకంగా ఇవ్వాలని సూచించారు. మీ అర్జీలను జిల్లా రెవెన్యూ శాఖ కార్యాలయానికి పంపిస్తామని, వివరణ రాగానే మీకు తెలుపుదామని హామీ ఇచ్చారు. అనంతరం బుడుగు జంగాల నాయకులు ఎస్సీ నాయకులు ఆందోళనలు విరమించారు. ఈ ఆందోళనలో రేవల్లి ఎల్లయ్య ,విభూది సాంబయ్య, శివ, నాగేశ్వరరావు, అల్లూరయ్య, కృపయ్య చందనా బ్రదర్స్ యాజమాన్యం పాల్గొన్నారు.

పిఎం శ్రీ పనుల జాప్యంపై సమగ్ర శిక్ష ఏపీసి అసంతృప్తి

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగున్న పిఎం శ్రీ నిధులతో చేపట్టవలసిన అభివృద్ధి పనుల జాప్యంపై సమగ్ర శిక్ష ఏపీసి వరద సుబ్బారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీ పాఠశాలను సందర్శించి ఇంటర్ అడ్మిషన్లపై ఆరా తీశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను పిలిపించి తరగతులు ప్రారంభించాలని ప్రిన్సిపాల్ పి జ్యోతికి సూచించారు.అలాగే బోధనా సిబ్బంది పాఠశాలలో అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఆట స్థలం అభివఅద్ధికి పిఎం శ్రీ నిధులు ఐదు లక్షలు మంజూరవ్వగా పనులు ప్రారంభించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అలాగే వాటర్ షెడ్, కిచెన్ గార్డెన్‌లకు నిధులు మంజూరు అయ్యాయని పనులు చేయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎంసి చైర్మన్, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వనికుంట.గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ భవనాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశ క్తి - తాడేపల్లి

భారతీయ రిజర్వు బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (ఖాతాదారుల చైతన్య మరియు అవగాహన సదస్సు)పై ఒకరోజు వర్క్ షాప్ తాడేపల్లి మున్సిపల్ మీటింగ్ హాలులో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక మాట్లాడుతూ అందరూ తమ బ్యాంకులో పరపతిని పెంచుకోవాలని, సంపాదనలో ఇరవై శాతం తప్పకుండా పొదుపు చేయడం నేర్చుకోవాలని కోరారు. ఈ వర్క్ షాప్‌కి అధ్యక్షత వహించిన ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ఆర్థిక క్రమశిక్షణ కలిగి లక్షాధికారి కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ బ్యాంకులో మాత్రమే మీ డబ్బుకు భద్రత వుంటుందని, ప్రైవేటు వడ్డీల జోలికి వెళ్ల వద్దని సూచించారు. మెప్మా పట్టణ కమ్యూనిటీ ఆర్గనైజర్ రమణ మాట్లాడుతూ బ్యాంకులతో మంచిగా లావాదేవీలను నడపాలనీ, డిఫాల్టర్ గా ఉండకూడదని చెప్పారు. మెప్మా పట్టణ కమ్యూనిటీ ఆర్గనైజర్ పి.పద్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి బ్యాంకు సేవలను మన పరిసర ప్రాంతాలలో అందరికీ తెలియజేయాలని అన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్త విప్పర్ల విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థికంగా స్థిరపడాలని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని చెప్పారు. ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకులోని నిరర్థక ఖాతాల నుండి సేకరించిన నిధులతో ప్రజలకు అవగాహన కల్పిస్తామని, బ్యాంకులో జరిగే ఖాతాలు, పొదుపు నిర్వహణ గురించి వివరించారు. ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ షేక్ బాజీ మాట్లాడుతూ బ్యాంకు సేవలు కోసం ఇతరులపై ఆధారపడకూడదని, సొంతంగా ఎటిఎంను వాడటం అలవాటుచేసుకోవాలని, డిజిటల్ అరెస్టు గురించి తెలుసుకొని అప్రమత్తంగా వుండాలని, బ్యాంకు సేవలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివఅద్ధి చెందాలని అన్నారు. రిసోర్స్ పర్సన్ తురకా మంగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు అలవాటు చేసుకొని సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్పీ అధ్యక్షురాలు రాణి, విజయకుమారి, రమాదేవి, దుర్గా ఇంద్రాణి, శౌరయ్య, నాగేశ్వరరావు, వివిధ సంఘాల ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళలు

రౌడీ షీటర్ అరెస్ట్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరికి చెందిన ఓ వ్యాపారిపై దౌర్జన్యం చేసి బెదిరించిన కేసులో బండారు రవి అలియాస్ బక్క రవి అనే రౌడీషీటర్‌ను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. కేసులో సదరు రౌడీషీటర్‌ను జైలుకు పంపినట్లు పట్టణ సిఐ డి.వినోద్ కుమార్ బుధవారం తెలిపారు. బండారు రవి రౌడీ షీట్‌ను అడ్డు పెట్టుకొని పలువురిని భయభ్రాంతులకు గురి చేసినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు ఇప్పటికే కొట్లాట, దౌర్జన్యం, బెదిరింపు కేసులు నమోదయి ఉన్నాయని అన్నారు. ఇటీవల బుల్లా సన్నీ అనే రౌడీషీటర్‌పై పిడి యాక్ట్ క్రింద కేసు నమోదు చేశామని సిఐ గుర్తు చేశారు. తాజాగా దౌర్జన్యం కేసులో ఓ రౌడీ షీటర్‌ను జైలుకు పంపామని తెలిపారు. రౌడీ షీటర్లు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. వారి ఆగడాలను ఉపేక్షించేది లేదని సందర్భంగా సిఐ తెలిపారు.



అరెస్టు అయిన రౌడీషీటర్, సిఐ వినోద్



శిక్షణ పొందుతున్న బాల బాలికలు

ముగిసిన రాజధాని బాలోత్సవం

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో పది రోజులపాటు కొనసాగిన రాజధాని బాలోత్సవం (సమ్మర్ క్యాంప్) బుధవారంతో ముగిసింది. సమ్మర్ క్యాంపులో బాల బాలికలు ఆటలు, పాటలు, డ్యాన్స్, డ్రాయింగ్, మ్యాజిక్,కలర్ పేపర్స్‌తో బొమ్మలు చేయడం నేర్చుకున్నారు. యూటీఎఫ్, ప్రజా నాట్య మండలి,జన విజ్ఞాన వేదిక నాయకులు పోపూరి వెంకటేశ్వర్లు వల్లభాపురం ప్రసాద్, పద్మ, సౌమ్య, కె.సునీత బాల బాలికలకు శిక్షణ ఇచ్చారు. బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు వల్లభాపురం ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన ఏర్పరచుకోవాలని అన్నారు. సమాజంలో కొందరు తమ బ్రతుకుతెరువు కోసం అస్త లాగువం ద్వారా గాలిలో కొన్ని వస్తువులు సఅష్టిస్తూ ప్రజలను మూఢనమ్మకాల్లోకి తీసుకు వెళుతున్నారని, వాటి వెనుక ఎటువంటి మాయలు ,మంత్రాలు లేవని కేవలం మ్యాజిక్కేనని అన్నారు. కొన్ని మ్యాజిక్స్ చేసి చూపించి బాల బాలికలకు అవగాహన కల్పించారు. కలర్ పేపర్స్ తో పువ్వులు, పక్షులు ఇతర బమ్మలు ఎలా తయారు చేయాలో సౌమ్య బాల బాలికలకు నేర్పించారు.



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వేసవి శిక్షణ తరగతులు కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ అధికారి బి.అరుణ విద్యార్థులకు నీతి కథలు, ఇంగ్లీష్ చదివించడం, బోధించడం అలాగే విద్యార్థుల చేత డోర్ గేమ్స్, స్నీకర్స్ మరియు లాడర్స్, చెస్, గేమ్స్ నేర్పించి వారిచే ఆడించారు. ఈ కార్యక్రమం లో మొత్తం 11 మంది విద్యార్దులు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి బి.అరుణ కుమారి తెలిపారు.



వేతనదారులతో మాట్లాడుతున్న రవిబాబు

ఉపాధి వేతనాలను వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - క్రోసూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనాలను వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి రవిబాబు అన్నారు. మంగళవారం మండ లంలోని ఉయ్యందనం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలన చేసి వేతనదారులతో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా రవి బాబు మాట్లాడుతూ నెలలు తరబడి ఉపాధి హామీ వేత నాలు అందకపోతే ప్రజలు ఏ విధంగా తమ కుటుంబ అవసరాలు తీర్చుకుంటారు అని ప్రశ్నించారు. ఎని మిది వారాలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయిం చడం తక్కువగా ఉన్నందున వేతనాలు అందటంలో ఆలస్యం అవుతోందని ఈ విధానాన్ని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. గ్రామంలో ఉన్న మొత్తం వేతన దారులను మొత్తాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ ఆన్లైన్ హాజరు వేయటం వలన ఆలస్యం కావటం, సర్వర్ లేనప్పుడు హాజరు పడక పోవడం లాంటి సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం జనవరి మూడో తేదీ విడుదల చేసిన జీవోను అమలు చేస్తూ శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేయడం, మెట్లతో పని చేయించడం, పనిచేసినందుకు మెట్లకు పారితోషకం ఇవ్వాలని కోరారు. వేతనాలు వెంటనే ఇవ్వాలని జరగనున్న ఆందోళనలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఏపూరి వెంకటేశ్వర్లు మెట్లు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సుభాష్ చంద్రబోసు

ఈద్గా వద్ద ప్రత్యేక పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - వినుకొండ

ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీ వి ఆంజనేయులు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఎమ్. సుభాష్ చంద్ర బోస్ సూచనలతో జూన్ 7వ తారీఖున జరుపుకోబోయే బక్రీద్ పండుగ సందర్భంగా నమాజ్ కుంట నందు ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులను రెండు రోజులుగా చేపట్టారు. బుధ వారం ఈ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ మాట్లా డుతూ ముస్లింల ముఖ్య పండుగల్లో ఈద్-ఉల్- అధా ఒకటని దీన్ని త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారని తెలియజేశారు. పండుగ రోజున ఈద్గా కు వచ్చే ముస్లిం సోదరులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలియ జేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించే డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినుకొండ ఆర్టిసి డి.ఎం జే.నాగేశ్వరరావు తెలియజేశారు.ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 03:00 నుంచి 04:00 గంట వరకు 99592 25431 నెంబర్‌కి ఫోన్ చేసి వినుకొండ నియోజకవర్గంలో ఏపీఎస్ఆర్టీసీ డిపోకు సంబంధించిన తమ ఫిర్యాదులను తెలియ జేయాలన్నారు. డిపో పరిధిలో పట్టణం, గ్రామాల నుండి సమయ వేళల్లో మార్పులు, సర్వీసులకు సంబంధించి ప్రయాణి కులు తెలియజేయాలన్నారు. సమస్యలతో పాటు సలహాలు, సూచనలు కూడా ఇవ్వాలని తెలియజేశారు.

రైతులకు ఎరువులు సకాలంలో పంపిణీ చేయండి

6వ డిసిడిసి సమావేశంలో ఉన్నతాధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఏసిఎస్) ద్వారా రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు మంజూరు చేయడంతో పాటు ఎరువులు పంపిణీ చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆయా పిఏసిఎస్‌ల ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా సహకార అభివృద్ధికి కమిటీ 6వ సమావేశంలో పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిఇఓ లు ఈ నెల 30 నాటికి నిరర్ధక ఆస్తులు 100 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిఇఓలపై, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు జిల్లాలో ఎరువులు వ్యాపారం చేయని 21 ప్రాథమిక వ్యవ సాయ సహకార పరపతి సంఘాలు వ్యవసాయ శాఖ నుండి ఎరువుల లైసెన్సులు పొందాల్సి ఉందని, అందుకు కావలసిన కృషి విజ్ఞాన్ కేంద్రం దర్శి నుండి సర్టిఫికేట్ తీసు కోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు తాము చేపట్టబోయే వ్యాపార అభివద్ధి ప్రణాళికలను సిద్ధం చేసి రాబోయే 7 వ డిసిడిసి సమావేశానికి అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు నిర్వహిస్తున్న కామన్ సర్వీస్ సెంటర్ల లావాదేవీలను పెంచా లని కలెక్టర్ సూచించారు. గోదాములను 100 శాతం వినియోగించేందుకు కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని ఆదేశించారు. నికర విలువ ఉన్న అన్ని ప్రాథ మిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు జూన్ 30వ తేదీ లోపు డబ్ల్యూ.డి.ఆర్.ఏ గుర్తింపు పొందాలని ఆదేశిం చారు. వివిధ కారణాలతో మూసివేయబడిన ధూళిపాళ్ళ లోని ఆంధ్ర బ్యాంకు ఫార్మర్స్ సర్వీస్ కోపరేటివ్ సొసైటీ పెట్రోల్ బంక్‌ను తిరిగి ప్రారంభించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులతో చర్చించి త్వరగా ప్రారంభించాలని సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకానికి సంబంధించిన పురోగతి సరిగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిడిసిసిబి సీఈఓ తక్షణమే రుణ విధానాలను నిర్ణయించి, అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ, జిల్లా పంచాయితీ అధికారి నాగేశ్వర నాయక్, మత్స్య శాఖ జిల్లా అధికారి సంజీవరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.కాంతారావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ పంచాయత్ రాజ్, జిడిసిసిబి ఏజిఎం సుబ్బారావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్లాబ్ ప్రకారం యూనిట్లు లెక్కించి బిల్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గతంలో విద్యుత్ శాఖ వారు 0-100 యూనిట్ల వరకు ఒక రేటు నిర్ణయించారు. ఆ తర్వాత 101-150 వరకు మరో రేటు నిర్ణయించారు. బిల్లు రేట్లు లెక్క కట్టేట ప్పుడు100 యూనిట్లు వచ్చిన రేట్ల ప్రకారం వచ్చిన డబ్బు చెల్లించేవారు. ఆ తరువాత 101 నుంచి పెంచిన ధర పెరిగిన యూనిట్లకు వర్తింపు చేసేవారు. ఉదాహరణకు 100 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకుంటే రూపాయి చొప్పున లెక్క కడితే రూ.100లు ఆ తరువాత ఎన్ని విద్యుత్ యూనిట్లు వాడుకుంటే వాటికి మాత్రమే లెక్కకట్టే వారు. అందే స్లాబ్ ప్రకారం లెక్కలు కట్టే వారు. ప్రస్తుతం అట్లా కాదు..ప్రస్తుతం విద్యుత్ యూనిట్ల వాడకం స్లాబ్ తగ్గించా రు. రూ. 100యూనిట్లను కాస్త 0 నుంచి 30 వరకు తగ్గించి యూనిట్ కి రూ.1.90 పైసలు వసూలు చేస్తు న్నారు. ముఖ్యంగా 31-75 యూనిట్ల లోపు వాడుకున్న వాటికి రూ.3లు చేశారు. 76-125 వరకు ఏకంగా 4.5 0 పైసలు పెంచారు. ఇది ఒక సమస్య అయితే ప్రధానంగా 125 యూనిట్లు వాడుకుంటే 0 నుంచి 125 యూనిట్లకు ఒకే రేటు కట్టి అంటే రూ. 4.50 పైసలు లెక్కన స్లాబ్ రేట్ల ప్రకారం కాకుండా వసూలు చేస్తున్నారు. ఇవేకాక అదనంగా సర్ చార్జీలు, కస్ట మర్ చార్జీలు, ఎల క్ట్రిసిటీ డ్యూటీ ఇంట్రస్ట్, సర్చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, ఎఫ్‌బిపిసి ఏ చార్జీల 22, 23, 24, 25 సంవత్సరాలవి గతంలో వాడుకున్న అదనపు యూనిట్లు కింద చార్జీలు, దీనికి తోడు విద్యుత్ శాఖ వారు ఇచ్చిన గడువు పొరపాటున ఒక్కరోజు దాటినా రూ. 100



అధిక మొత్తంలో వచ్చిన విద్యుత్ బిల్లులు

లు అదనపు చార్జీలతో వస్తువులు చేయటంతో కరెంటు బిల్లులు కట్టలేక సామాన్య, మధ్యతరగతి వినియోగదారులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గతంలో విధించిన యూనిట్ల స్లాబ్ ప్రకారం ఎన్ని యూనిట్లు వాడుకుంటే అన్ని యూనిట్లకు ఆయా స్లాబులలో ఉన్న రేట్ల ప్రకారమే బిల్లులు విధించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు. ముఖ్యంగా అదనంగా విధిస్తున్న చార్జీలను పూర్తిగా తీసి వేయాలని కోరుతున్నారు. రాత్రుళ్ళ జీరో బల్బ్ కొన్ని రోజులు మాత్రమే వాడినా అన్ని విద్యుత్ చార్జీలు కలుపుకుని రూ. 296 లుగా వచ్చిందని వాపోతున్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఉప్పలపాడు ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - విపి సౌత్

వెల్దుర్తి మండలం, ఉప్పలపాడు గ్రామంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆకస్మిక తనిఖి చేసారు. ప్రాథమిక కేంద్రంలోని అన్ని విభా గాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రా నికి రోజూ ఎంత మంది పేషెంట్లు వస్తున్నారు, వారికి అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పిహెచ్ సిలో ఉన్న ల్యాబ్‌లో అన్ని పరీక్షలు చేస్తున్నారా, సిబ్బంది సకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారా అనే విషయాపై వివరాలు సేకరించారు. అనంతరం రిజిష్టర్లను, హాజరు పట్టిక రిజిష్టరును పరిశీలించారు. ఈహెచ్ఆర్ (ఎంప్లాయీస్ హెల్త్ రికార్డ్స్) ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారా, చేస్తుంటే త్వరిత గతిన పూర్తీ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి.వి.రవి, వైద్యులు బంగ ప్రసన్నలక్ష్మి, పి.హెచ్.సి. సిబ్బంది ఉన్నారు.

కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ వర్తింప చేయండి

కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు తిమ్మిశెట్టి హనుమంతరావు

క్రోసూరు - ప్రజాశక్తి

ప్రభుత్వం పెట్టుబడి సహాయం కింద చెల్లిస్తున్న అన్నదాత సుఖీభవ రూ. 20వేలు కౌలు రైతులకు వర్తింప చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ అధికారి విఏఏ సందీప్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో ప్రకటించనున్న పెట్టుబడి సహాయం కింద రూ. 20వేలు గురించి ఇంతవరకు విధి విధానాలు రూపొందించలేదని , ప్రత్యక్షంగా ఎటువంటి ఆర్థిక భరోసా లేకుండా వ్యవసాయం చేస్తున్న ఈ భూమిలేని కౌలు రైతులకు కూడా వెంటనే ఈ అన్నదాత సుఖీభవ అందించి, కౌలు రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలని అన్నారు. మేము అధికారంలోకొస్తే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించి , కౌలు కార్డులు మంజూరు చేసి కౌలు రైతులకు మరింత మేలు చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చి నేటికీ సంవత్సరం కావస్తున్నప్పటికీ, కౌలు రైతులను గుర్తించే విధానంలో కానీ , వారికి అన్నదాత సుఖీభవ వర్తిం ప చేయడంలో ఎలాంటి విధి విధానాలు లేకుండా ఈ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్లడం సరైన విధానం కాదని అన్నారు. కౌలు రైతులను గుర్తించడంలో ఇప్పటికీ సరైన విధివిధానాలు లేని నేపథ్యంలో దాదాపు 70శాతంగా ఉన్న కౌలు రైతులకు (భూమి ఉండి అదనంగా కొంత పొలం సాగు చేసేవారు కావచ్చు, భూమి లేకుండా సాగు చేసేవారు కావచ్చు) ప్రభుత్వం ప్రకటించే ఏ పథకాలు కూడా అందకుండా నష్టపోతున్నారని అన్నారు. ఈ విధంగా భూమిలేని కౌలు రైతులు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని లక్షల మంది ఉన్నారని , భూమి లేని కౌలు రైతుల్లో ఓ.సి పేద కౌలు



వ్యవసాయాధికారికి వినతి పత్రం ఇస్తున్న కౌలురైతులు

రైతులు కూడా ఉన్నారని, గత ప్రభుత్వం లాగా కాకుండా అన్ని తరగతుల్లో భూమిలేని కౌలు రైతులను గుర్తించి అందరికీ పెట్టుబడి సహాయం, కౌలు రైతు గుర్తింపు కార్డు, పంట నమోదు, పంట నష్ట పరిహారం, పంట రుణం అందే విధంగా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి పక్షంలో ఉన్నప్పుడు , ఆర్థిక ఇబ్బందులతో చనిపోయిన కౌలు రైతులకు లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఇప్పుడు అధికారంలో వచ్చిన తర్వాత కౌలు రైతుల పట్ల సరైన విధివిధానాల రూపొందించకపోవడం, కౌలు రైతులను ఆదుకోవడానికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం కౌలు రైతులందరికీ ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సమస్య తీవ్రతను తెలియ జేయడానికి ఈనెల 11వ తేదీన తేదీన వ్యవసాయ శాఖ కమిషనర్ , మంగళగిరి ఆఫీసుకు చలో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యక్రమం చేపట్టనున్నామనీ, కౌలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో బలుసు పాటి కాశీయ్య , ఏకుల ఆనంద్ బాబు, కుంభ కోటయ్య, పెరికల శ్రీను, చింతకాయల అప్పారావు, కందిమల్ల రామారావు , మల్లెల సౌరి , గంటల చిన్నప్ప పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఉపాధి హామీ సిబ్బంది

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి - విపి సౌత్

మాచర్ల మండలం కంభంపాడు గ్రామం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇనిస్టిట్యూషన్ ప్లాంటేషన్ ఫిట్టింగ్ ఫీల్డ్ విజిట్ లో భాగంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5 నప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సేద్యపు నీటి కుంటలు, అమత సరోవర్‌ల వద్ద విరివిగా మొక్కలు నాటాలనీ, హార్టికల్చర్ పెంపకంలో భాగంగా రైతులకు పండ్ల తోటలకు తమ పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత మండల పరిషత్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక కార్యాలయంలో సంప్రదిం చాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక ఏపీడి కొరటా మల్లికార్జునరావు, ఏపీవో నాగ శ్రీనివాస్, టి.ఏ. కిషోర్ బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ నాగమల్లే శ్వర రావు, క్లస్టర్ టి ఏ గోవిందరాజు, క్లస్టర్ సీసీఓ రాఘవ మరియు ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం ఫౌండేషన్ సేవలు అద్భుతం

- మహిళల విద్యా, నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పాటు
- తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా ప్రశంస
- కురగల్లులో కంప్యూటర్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్ల ప్రారంభం



కురగల్లులో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ సెంటర్లను ప్రారంభిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా, విద్యార్థులకు పుస్తకాలు పెన్నుల్లు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చెన్నైలోని ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, వారికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలు అద్భుతమని తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా కొనియాడారు. ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజధాని గ్రామం కురగల్లులో బుధవారం ఉచిత కంప్యూటర్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వర్శిటీ ప్రో-ఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్‌తో కలిసి బుధవారం సబ్ కలెక్టర్ సంజనాసింహా ఈ సెంటర్లను ప్రారంభించారు. మహిళలతో ముచ్చటించారు. ట్యూషన్ చిన్నారులకు పుస్లకాలు, పెన్నులు, విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరావతిలో అతిపెద్ద విద్యా సంస్థగా ఎస్ఆర్ఎం వేలాది మంది విద్యార్థులకు విజ్ఞాన జ్యోతులను వెలిగిస్తుందన్నారు. మహిళల ఆర్థిక స్వాలంబన సాధించాలని, అందుకోసం స్వయం ఉపాధి కోర్సులను అందిపుచ్చు కోవాలనే లక్ష్యంతోనే గ్రామీణ ప్రాంతాల్లో టైలరింగ్, కంప్యూటర్ శిక్షణ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఆర్ఎం వర్శిటీ ప్రో.వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఉన్నత చదువులతోని విజయ సోపనాల అధిరోహణ సాధ్యమన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకో వాలన్నారు. ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉచిత సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి డి.వి. వెంకటగిరి తెలిపారు. మారుమూల పల్లెకు వచ్చి ఉచితంగా ఉపాధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎస్ఆర్ఎం వర్శిటీ సేవలు ఎన్నటికి మరచిపోలేమని రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారధి కొనియాడారు. మహిళలతో పాటు యువత ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు రామారావు పిలుపునిచ్చారు. గ్రామస్తులు తరుపున వర్శిటీ ప్రొ-ఛాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్, ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వెంకటగిరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సంజనా సింహ ఎస్ఆర్ఎం ట్యూషన్ సెంటర్ల టీచర్లు ప్రతిపాటి సుష్మ, పుణ్యవాణి కొండూరు భారతి ప్రమీల, ధన కుమారి లను వేదికపైకి ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎస్ఆర్ఎం ఫౌండేషన్ పనితీరును వివరించే న్యూస్ లెటర్‌ను సబ్‌కలెక్టర్ సంజన వేదికపై ఆవిష్కరించారు ఫౌండేషన్ కార్యదర్శి వెంకటగిరి ఆచార్య సతీష్ లు సంయుక్తంగా సబ్ కలెక్టర్ కు జ్ఞాపిక ప్రధానం చేశారు ఈ సందర్భంగా కురగల్లు ట్యూషన్ సెంటర్ విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు ఇతర ఇతర స్టేషనరీని పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అడిషనల్ రిజిస్టర్ డాక్టర్ వినాయక, డైరెక్టర్లు అనూప్ సింగ్, రేవతి బాలకృష్ణ సిద్ధార్థ త్రిపాఠిలతో పాటు మీడియా మేనేజర్ వేణుగోపాల్ గంగిశెట్టి పాల్గొన్నారు.



డ్రోన్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

రైతులకు వ్యవసాయ డ్రోన్లు పంపిణీ

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో బుధవారం పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రైతులకు వ్యవసాయ డ్రోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ రైతులకు కావాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే పరికరాలను సబ్సిడీపై అందిస్తుందని ఈరోజు ఉప్పలపాడు గ్రామంలో డ్రోన్లు పంపిణీ చేయడం జరిగిందని వీటితో పురుగుమందులు వాడకం తేలికవుతుందని రైతుకు వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయి అన్నారు. అనమర్లపూడి, నంబూరు గ్రామాల్లో కూడా కిసాన్ డ్రోన్లు పంపిణీ చేశామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిని సంధ్యారాణి,మండల పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, సర్పంచ్ కె.శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.



183వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసిసిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 183వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడారు. దీక్షలో వై.రమాదేవి, సారమ్మ,శారద, శివమ్మ, హిమాంబి, మల్లేశ్వరి కూర్చున్నారు. కార్యక్రమంలో ఎం.గురవయ్య, వై.సాంబయ్య, ఇశ్రాయేలు, సుభాని, నాగేశ్వరరావు, సుబ్బారావు, మాణిక్యరావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్.పి.బాలసుబ్రమణ్యం జయంతి

ప్రజాశక్తి - వినుకొండ

గాన గంధర్వులు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా స్థానిక వెంకటేశ్వర స్టూడియో లో గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావిపాటి వీరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో రావిపాటి వీరయ్య , నిడమానూరు సుబ్బారావు, ఉప్పలపాటి బ్రహ్మాం, పాలడుగు వెంకటరావు , పారేళ్ళ ప్రసాద్, పత్తేపురం వెంకట్రావు, గుమ్మడి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి - మేడికొండూరు



తల్లిదండ్రులతో బంగారు పతకం సాధించిన దాసరి ఇందుమతి

మండలంలోని విసదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్నారైటి ఇంజనీరింగ్ కళాశాల చెందిన విద్యార్థిని దాసరి ఇందుమతి జేఎన్టీయూ కాకినాడ యూనివర్సిటీ ఎఫిలియేటెడ్ కాలేజెస్ రిజల్ట్స్‌లో బంగారు పతకాన్ని సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డి.సంజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తమ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థిని దాసరి ఇందుమతి అత్యధిక పాస్ పర్సంటేజ్‌తో 8.9 సిజిపిఏతో ఉత్తీర్ణత సాధించి, యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించిందని తెలిపారు. అన్ని సెమిస్టర్‌లలో మంచి పాస్ పర్సంటేజ్‌ని సాధిస్తూ వచ్చారని విభాగాధిపతి డాక్టర్ మల్లేశ్వరి తెలియజేశారు. సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్ బాబు మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే ఎంతటి సమస్యలనైన ఎదిరించి ఉన్నత స్థితికి ఎదగవచ్చునని ఇందుమతి ప్రతి విద్యార్థికి ఆదర్శమన్నారు. ఎవో.సీతా రామయ్య, సెక్రటరీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, చంద్రమౌళి రెహమాన్, రాము, కెఎస్ఆర్ నాగేశ్వరావు , కోటేశ్వరావు, బోధన, బోధ నేతర సిబ్బంది ఇందుమతిని అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలలో పథకాలు సాధించిన జిల్లా పవర్ లిఫ్టర్లు

ప్రజాశక్తి - మంగళగిరి



ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో మే 31, జూన్ 1,2 తేదీలలో జరిగిన ఏపీ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ (మెన్ & ఉమెన్) బెంచ్ ప్రెస్ చాంపియన్షిప్ పోటీలలో గుంటూరు జిల్లా మెన్ అండ్ ఉమెన్, మాస్టర్స్ పవర్ లిఫ్టర్లు పాల్గొని అనేక పతకాలు సాధించారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని బుధవారం మంగళగిరిలో జరిగిన అభినందన కార్యక్రమంలో తెలియజేశారు. సబ్ జూనియర్ గర్ల్స్ టీం ఛాంపియన్షి రెండవ స్థానం, సబ్ జూనియర్ బాయ్స్ మూడవ స్థానం, జూనియర్ ఉమెన్‌లో మొదటి స్థానం, జూనియర్ మెన్‌లో మూడవ స్థానం, సీనియర్ ఉమెన్‌లో మొదటి స్థానం, సీనియర్ మెన్‌లో మొదటి స్థానం సాధించారని తెలిపారు. ఓవరాల్ టీమ్స్ ఛాంపియన్షిప్ మెన్ అండ్ వుమెన్‌లో మొదటి స్థానం సాధించారని తెలియజేశారు. ఈ సందర్భంగా లిఫ్టర్లకు పలువురు అభినందనలు తెలిపారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయంలో చిత్ర లేఖనం పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థినీ విద్యార్థులకు స్వర్ణాంధ్ర 2047పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లుగా గ్రంథాలయ అధికారి ఎన్ ఆరోగ్యం తెలిపారు. గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ఈనెల ఆరో తేదీన బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని తెలియజేశారు.

మధ్యాహ్నాం భోజన కార్మికుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

మధ్యాహ్నాం భోజన కార్మికులకు పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల జీతాలు, వంట బిల్లులు వెంటనే చెల్లించాలని మధ్యాహ్నాం భోజనం కార్మిక సంఘం యూనియన్(సిఐటియు) గౌరవాధ్యక్షుడు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లిలో సిఐటియు కార్యాలయం వద్ద మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం సిఐటియు విస్తృత సమావేశం కోటా స్వర్ణలత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం 10 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జులై 9 వ తేదీన దేశవ్యాప్తంగా జరగబోయే సమ్మెలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని దుర్గారావు కోరారు. తాడేపల్లి మండల గౌరవ అధ్యక్షుడిగా వేముల దుర్గారావు, అధ్యక్షురాలుగా బి.అనురాధ, కార్యదర్శిగా పంతగాని నాగలక్ష్మి మరో ఏడుగురు తోటి మండల కమిటీ ఏర్పడింది.

ప్రజాశక్తి - చేబ్రోలు

మధ్యాహ్నాం భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలు, వంట బిల్లులు వెంటనే చెల్లించాలని నియన్ గౌరవ అధ్యక్షులు నిమ్మకూరి రమేష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రం ఆఫీస్ ప్రాంగణంలో యండియం కార్మికులతో సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్మికులతో రమేష్ బాబు మాట్లాడుతూ జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరగబోయే సమ్మెలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు సుమతి , కృష్ణకుమారి కార్మికులందరూ పాల్గొన్నారు.

మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం : రాయపాటి శైలజ

ప్రజాశక్తి-తెనాలిరూరల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ

మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ అన్నారు. బుధవారం ఇటీవల తెనాలి రౌడీ షీటర్ల దాడిలో గాయపడిన చిరంజీవిని తన భార్య కల్యాణిలను ఆమె పరామర్శించారు. ఐతానగర్ లోని కానిస్టేబుల్ చిరంజీవి నివాసంలో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా తాను చిరంజీవి భార్య కల్యాణిని కలసి పరార్శించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రజలు హర్షించరన్నారు. రౌడి మూకలను వెనకేసుకొస్తున్న వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తన భర్త చిరంజీవికి రక్షణ కల్పించాలంటూ కొన్ని టివి చానళ్లలో వచ్చిన ప్రచారం ఆధారంగా మహిళ కమీషన్ ఛైర్మెన్‌గా తను తెనాలి రావడం జరిగిందన్నారు. ఓ పోలీసుకే రక్షణ కరువైతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ చిరంజీవి భార్య కల్యాణి పెట్టిన కేసును మహిళా కమిషన్ తరపున సుమోటుగా స్వీకరించినట్లు తెలిపారు. గంజాయి కేసుల్లో ముద్దాయిలైన దోమా రాకేష్, చేబ్రోలు జాన్ విక్టర్, షేక్ కరీముల్లా అనే రౌడీషీటర్లకు మద్దతుగా జగన్మోహన్‌రెడ్డి తెనాలి వచ్చి పరామర్శించడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వపగ్గాలు చేపట్టిన అనంతరం తెనాలిలో మొత్తం 105 గంజాయి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు హెూదాలో జగన్మోహన్ రెడ్డి గంజాయి కేసులో నిందితులను పరామర్శించడం శోచనీయమని మహిళా కమిషన్ మాజీ ఛైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. ఈ సందర్భంగా తెనాలి వచ్చిన శైలజను తెనాలి తాహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, సిడిపిఓ డాక్టర్ ఎం సునీత, అంగన్వాడీ సూపర్వైజర్ సౌజన్యశ్రీ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు.

నేడు 10 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా

కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యోగాంధ్ర మాసోత్సవ వేడుకలలో భాగంగా నేడు ఉదయం 6 8 గంటల వరకు రాష్ట్ర స్థాయి యోగాంధ్ర కార్య క్రమాన్ని స్థానిక కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిం చనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు వెల్లడించారు. సుమారు 10వేల మంది సామూహిక యోగాలో పాల్గొన నున్నారని తెలిపారు. కార్యక్రమానికి నినాదంగా 'ఏఎన్ఎం ల ఆశావర్కర్లుని ఎంపిక చేయడం జరిగిందన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించ ుకొని పోలీస పెరేడ్‌గ్రౌండ్స్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలం, మున్సిపాలిటీలలో మొక్కలు నాటడం, పర్యా వరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.

సైకో పాలన నుండి విముక్తితో ప్రజలకు మరో స్వాతంత్రం

మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్

ప్రజాశక్తి - మాచర్ల

ఎపిని పట్టిపీడిస్తున్న సైకో పాలన నుండి విముక్తి పొం దిన రాష్ట్ర ప్రజలు మరో మారు స్వాతంత్రాన్ని పొందిన ఆనం దంలో ఉన్నారని మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, తెలుగు దేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు స్పష్టం చేశా రు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది ముగిసిన నేపధ్యంలో టిడిపి శ్రేణులు బుధవారం పట్టణంలోని స్థానిక బస్టాండ్ సెంటర్ కూడలిలో భారీ కేక్ కట్ చేసి పండుగ నిర్వ హించారు. గత ఏడాది జూన్ 4న మాచర్ల శాసన సభ్యులుగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి సాధించిన అఖండ విజయాన్ని గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వ నేతృత్వంలో, ఎమ్మెల్యే జూలకంటి సారధ్యంలో సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా నియో జకవర్గంలో శాంతియుత వాతావరణం నెల కొన్నట్లు వివరిం చారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయ కులు కంభంపాటి అనిల్ కుమార్, ఆన్వర్‌బాషా, సినిమా హాల్ జాని, కంభంపాటి చంటి, బుల్లిరెడ్డి, శశిధర్‌రెడ్డి, గోట్టిపాళ్ళ మధు, వజ్రంనాయక్ బ్యుంగా రమణ, సిద్దయ్య, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, మంజుల ఆంజి, ముడిశెట్టి శ్రీనివాసరావు, మాచర్ల బాబు పాల్గొన్నారు.

గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివరెడ్డి

ప్రజాశక్తి బెల్లంకొండ

మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలందరూ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న వస్తువులు, ఇంట్లో ఉన్న నగదు ఆభరణాలు పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివరెడ్డి అన్నారు. బుధ వారం మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో ఎర్రబద్దూరి చిన్న రమణ రెడ్డి ఇంట్లో జరిగిన బంగారు ఆభరణాలు అప హరణ విషయంపై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కోర్ కమిటీ సభ్యు లు వెన్న సీతా రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తిప్పిరెడ్డి కిష్టారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బద్దూరి వీరారెడ్డి, ఎర్రబద్దూరి వెంకటరెడ్డి, సుబ్బా రెడ్డి, ఎరుకలయ్య, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి

రూ.56లక్షల జడ్పీ నిధులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో పంచాయతీలు మనుగడ సాగించలేక, మున్సిపాలిటీపరిధిలో అభివృద్ధికి నోచక ఇబ్బంది పడ్డాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నా రు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మానుకొండ వారిపాలెంలో 40లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, గణప వరంలో నూతన ఫిల్టర్ బెడ్ల నిర్మాణ నికి జడ్పీ నిధులు కేటాయిస్తున్నట్లు జిల్లా పరిషత్ కార్యా లయ వర్గాలు ధృవీకరించాయన్నారు. చిలకలూరిపేట మున్సి పాలిటీలో విలీనం చేయడం వల్ల మానుకొండ వారిపా లెం, గణపవరంతో పాటు పసుమర్రు గ్రామాల ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులు, గ్రామ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లడం జరిగిందన్నారు. కమిషనర్ కృష్ణతేజ ప్రధానమైన తాగునీటి సమస్య పరిష్కారానికి సరిపడ నిధుల్ని జడ్పీ నుంచి కేటాయించాలని ఆదేశించడంతో రెండు గ్రామాలకు రూ. 56లక్షల జడ్పీ నిధులు మంజూరు చేశారన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

ప్రతిరోజు యోగాతో సంపూర్ణ ఆరోగ్యవంతులమవు తామని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధ వారం విజయపురి సౌత్ పరిధిలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన అనుపు వద్ద ఏర్పాటు చేసిన యోగా కార్య క్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన సహజ గాలి,ప్రశాంత వాతావరణంలో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమం లో సుమారు 2000 మంది పాల్గొన్నారన్నారు. జిల్లా రెవె న్యూ అధికారి మురళి మాట్లాడుతూ ఈనెల 21వ తారీఖున నిర్వహించనున్న ఇంటర్నేషనల్ యోగ డే విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఆయన తెలి పారు. ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ క్యూరేటర్ కమల్ హాసన్ మాట్లాడారు. కార్య క్రమంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మీ , పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ చైతన్య, ఆర్డీవో మురళీ కృష్ణ, డిస్ట్రిక్ మెడికల్ ఆఫీసర్ డా.రవి, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణ మోహన్, ఈఈ రమేష్ ,ఆర్అండ్‌బి ఎస్ఈ రాజా నాయక్, పిడి డ్వామా సిద్ద లింగమూర్తి, ఐసిడిఎస్ పిడి ఉమాదేవి, పిడి డిఆర్ డిఎ ఝాన్సీ రాణి, ట్రాన్స్పోర్ట్ అధికారి సంజీవ్ కుమార్ , డీఎఫ్ఓ ఫైర్ శ్రీధర్ రావు, డి ఎల్ డి వో గబ్రు నాయక్, హౌసింగ్ ఈఈ రవీంద్ర , డిపిఓ నాగేశ్వరనాయక్, జిల్లా పర్యాటక అధికారి నాయుడమ్మ , జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు , డిసిఒ వెంకటరమణ, ఏపీఎంఐపీ ఆంజనేయులు, ఏపిటిడిసి డిప్యూటీ మేనేజర్ శివారెడ్డి, గ్రౌండ్ వాటర్ అధికారి శ్రీనివాసరావు, మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, కమిషనర్ వేణుబాబు, మాచర్ల యంపిడిఓ ఫణి కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి,ఇతర శాఖల అధికారులు అందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మెట్టు గోవిం దరెడ్డి, దాదాపు 200 యోగ మ్యాట్స్ కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు.



యోగ మ్యాట్స్ ను పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

వైసిపి నాయకులపై అక్రమ కేసులు

పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గౌతంరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల నియోజకవర్గంలో వైసిపి నాయకులు తిరగకుండా చేసేందుకు పోలీసులతో అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని నర్సరావుపేట వైసిపి ఇన్‌చార్జీ గౌతంరెడ్డి అన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొనేందుకు మాచర్లకు వచ్చిన గౌతంరెడ్డి స్థానిక వైసిపి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై మాట్లాడేం దుకు కూడ తమను ర్యాలీ చేయకుండా పోలీసులు కట్టడి చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి అయిన నేపధ్యంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును నిలదీసేందుకు తమ పార్టీ పిలు పు మేరకు ర్యాలీ చేస్తుంటే పోలీసులు అనుమతులు ఇవ్వ కుండా అడ్డుకోవటం సరికాదన్నారు. తాము వినతిపత్రం ఇచ్చేందుకు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్ళేందుకు తమకు అను మతులు ఇవ్వలేదన్నారు. లా అండ్ ఆర్డర్ పేరుతో తమను అడ్డుకోవటం ఏమిటని ప్రశ్నిం చారు. కార్యక్రమంలో పిన్నెల్లి స్వాతి వెంకట రామిరెడ్డి, కామన బోయిన కోటయ్య, చిన్నజలీల్, పోలా శ్రీనివాస రావు, సంతోష్ పాల్గొన్నారు.

2029 కాంగ్రెస్‌దే అధికారం : డాక్టరు యరమల

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

2029 నాటికి రాష్ట్రంలో సైకోపార్టీ, మాయ పార్టీలు మాయం అవుతాయని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టరు యరమల రామచంద్రారెడ్డి జోస్యం చెప్పారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేఖరులతో మాట్లా డుతూ గత సంవత్సరం జూన్ 4న రాష్ట్రంలో జరిగిన ఎన్ని కల ఫలితాలలో సైకో పార్టీ పోయి, మాయ పార్టీ వచ్చింద న్నారు. సైకో పార్టీ వలన 2019 నుంచి 24 వరకు రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడినట్లు వివరించారు ఇసుక దందాతో, మద్యం దందాతో ఎంతోమంది పేద ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నట్లు తెలిపారు. జగన్ పాలనలో మద్యం సేవించిన అత్యధిక శాతం ఆనారోగ్యానికి గురైనట్లు వివరించారు. ఇక ఇప్పుడున్న మాయ పార్టీ అన్నీ మాయ మాటలే అని, ఇచ్చిన వాగ్దానాల్లో రెండు తప్పితే ఏవి అమ లు కాలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు సైకో పార్టీ మీద అసలు విశ్వాసం లేదన్నారు. మాయ పార్టీల మీద కూడ విశ్వాసం సన్నగిల్లుతున్నట్లు వివరించారు. 2029లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చరిత్ర తిరిగి రాయడం ఖాయమని, అధికా రం కాంగ్రెస్ పార్టీదే అని పార్టీ ఇన్‌చార్జీ రామచంద్రారెడ్డి అన్నారు. సమావేశంలో మాచర్ల పట్టణ పార్టీ అధ్యక్షులు కొమ్ము కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గాదె పుల్లారెడ్డి, రెంటచింతల, వెల్దుర్తి మండలాల పార్టీ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, నాయకులు నాజర్ వలి, పినపాటి రమేష్ పాల్గొన్నారు.



విడదల రజని ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ

పేటలో వైసిపి నిరసన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చిలకలూరిపేట నియోజక వర్గంలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం తీరు ఎండగడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్థానిక విడుదల రజని ఇంటి వద్ద నుంచి భారీ ర్యాలీగా భయలు దేరి మండల తహశీల్దార్ కా ర్యాలయం వద్దకు చేరుకున్నారు. రజిని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి జూన్ 4వ తేదీ నాటికి సంవత్సరం పూర్తి అయింది అన్నారు అవతాత లకు పెన్షన్ ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. అనం తరం పార్టీ శ్రేణుల తో కలిసి చిలకలూరిపేట తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్ కువినతిపత్రం అంద జేశారు. కార్య క్రమంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి భారీగా నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రివర్యులు వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం నిర సన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీ గా తరలివచ్చారు. నాయకులు, కార్య కర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. పెద కూర పాడు మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రైతు లు మద్దతు ధర లేక పండిన పంట అమ్ముకోలేక రోడ్డున పడ్డారని, ఉద్యోగస్తులకు డిఏలు, పిఆర్‌సి, వంటి హామీలు నెరవేర్చక వాళ్ళు రోడ్డు ఎక్కార న్నారని శంకరరావు ఆగ్రహించారు.

ప్రజాశక్తి - క్రోసూరు

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్య మంత్రి వర్యులు వైయస్‌జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం పెదకూర పాడు నియోజకవర్గం క్రోసూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ర్యాలీగా తహసీల్దార్ కార్యా లయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. పెదకూరపాడు మాజీ శాసన సభ్యులు నంబూరు శంకరరావు మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షులు అప్పారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఖాదర్ ,జడ్పిటిసి జమీల గఫూర్, ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య, గార్లపాడు దాసు, అనుముల రోసిరెడ్డి, తిప్పిరెడ్డి ఆఫిరెడ్డి , మాజీ సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, టి ప్రతాప్ రెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి విప్పర్ల వాసు, పీసుపాడు వెంకట రామిరెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, కంటూ వెంకటే శ్వర్లు, మండల మహిళా నాయకురాలు కామేశ్వరి, దొడ్లేరు రహీం,కస్తూరెడ్డి, ఖాజా, సయ్యద్ సైదా, మీరా, నరసింహ రెడ్డి ర్యాలీగా ఇన్చార్జి తహశీల్దార్ కే.శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

అరాచక శక్తులను ప్రోత్సాహిస్తున్న జగన్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి అరాచక శక్తులను ప్రోత్సాహానికి చేస్తున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదిక లో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సంద ర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం కేక్‌కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ జగన్ హయాంలో రాక్షస, అరాచక పాలన సాగించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథ కాలు అమలు చేస్తున్నారని చెప్పారు కూటమి ప్రభుత్వంలో గంజాయి డ్రగ్స్ మాఫియాపై ఉక్కు పాదం మోపు తున్నామని పేర్కొన్నారు.కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా జూన్ 4 : చీఫ్ విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర చరిత్రలోనే జూన్ 4, 2024, ప్రజల పోరాట దినంగా, గడిచిన ఏడాదంతా సుపరిపాలన సంవ త్సరంగా చరిత్రలో చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోనున్నాయని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది క్రితం సరిగ్గా ఇదే రోజు వైకాపా అవినీతి, అరాచక పాలన వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా నిలిచి, కూటమికి ఘనవిజయం అందించారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే తెలుగు దేశం, జనసేన, భాజపా కట్టుబడి పనిచేస్తున్నాయని తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణ పునఃప్రారంభం, పోలవరం పరుగులే అందుకు కళ్ల ముందు కనిపిస్తోన్న ఉదాహరణలని పేర్కొన్నారు. ఏడాదిలో సాధించిన పురోగతి, రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలపడానికి బలమైన పునాది వేసిందన్నారు జీవీ. ఇలాంటి పరిస్థితుల్లో అభినందించాల్సింది పోయి ప్రతిపక్ష వైకాపా ఈ విజయ వేడుకలను "వెన్నుపోటు దినం"గా ధర్నాలు చేయడం వారి వక్రబుద్ధిని తెలియజేస్తోందన్నారు. వారి ధర్నాలు, నిరస నలు రాజకీయ పతనం, ప్రజల తీర్పును జీర్ణించుకోలేని నిస్సహాయతనే తెలియజేస్తున్నాయన్నారు. ఇకనైనా జగన్, వైకాపా బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. ఈ ఏడాది సాధించిన విజయాలు కేవలం ఆరంభమే మాత్రమే అన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపడానికి కూటమి ప్రభుత్వం కృషి కొనసా గుతునే ఉంటుందని ప్రజలకు భరోసా ఇస్తున్నామన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలం తిమ్మాపురం ఎస్సీకాలనీలో క్యాన్సర్ వ్యాధిపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. స్థానిక ఎస్సీ కాలనీలో నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కార్య కర్తలు, ఆశాలు పాల్గొన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, రావడానికి కారణాలు, నివారణ మార్గాలు, వైద్య పరీక్షల ప్రాముఖ్యతపై వివరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణకుమారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 10 మిలియన్ల మంది క్యాన్సర్ కారణంగా చని పోతున్నారని, ముందస్తు స్క్రీనింగ్, తగిన చికిత్స ద్వారా మూడింట ఒక వంతు మరణాలను అరికట్టే అవకాశం ఉం దన్నారు. క్యాన్సర్ ఎక్కువగా శ్వాస కోశాలు, ఊపిరితిత్తులు, రొమ్ము, గర్భాశయం, చర్మం, జీర్ణనాళ వ్యవస్థలు వంటి అవయవాలను ప్రభావితం చేస్తుందన్నారు. కార్య క్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వై ప్రసాద్‌రావు, డీఈఓ ఎం సాంప్రనీత్, ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11గంటలకు జరుగుతుందని ఎంపిడిఓ బండి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు.వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు. సర్పంచ్ లు, ఎంపిటీసిలు,కో ఆప్షన్ సభ్యులు తప్పని సరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు ఐదు కోట్లా..!!

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల ఆస్తిపన్ను బకాయిలు ఐదు కోట్ల రూపాయలు పైచిలుకు ఉన్నాయి. ప్రతిరోజు ఇంటి పన్ను చెల్లించాలని కార్పొరేషన్ పరిధిలో మైకు మైక్ ప్రచారం జరుగుతూనే ఉంటుంది. సామాన్య ప్రజల నుండి వసూలు చేస్తున్నారు. ఆస్తి విలువ ఆధారంగా కేంద్ర ప్రభుత్వం 2021 నుండి ఆస్తి పన్ను విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రవేశపెట్టినప్పటి నుండి ప్రభుత్వం ఆస్తి విలువ పెంచిన వెంటనే ఆస్తి పన్ను పెరుగుతుంది. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 86 వేలు అసెస్మెంట్‌లు ఉన్నాయి. ఈ సంవత్సరం ఆర్థిక సంవత్సరంలో డిమాండ్ 43 కోట్లు ఉంది. ఎప్పటి వరకు ఏప్రిల్ మే నెలలో 34 శాతం పన్ను వసూలు చేయడం జరిగింది. ఖాళీ స్థలాల డిమాండు 6 కోట్లు, 19 శాతం వసూలు చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుండి నాలుకోట్ల రూపాయలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుండి కోటి రూపాయలు పైగా ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఈ వసూళ్లకు ప్రత్యేకంగా చర్యలు ఏమి చేపట్టరు. ప్రజల నుండి వసూలు చేయడానికి మాత్రం నిరంతరం అధికారి యంత్రాంగం పనిచేస్తూనే ఉంటుంది. నీటి పన్ను ఐదు కోట్ల రూపాయలు డిమాండ్ ఉంది. ఈ పన్ను వసూళ్లలో గత రెండు సంవత్సరాల నుండి కార్పొరేషన్ అధికారులు డిమాండ్ నోటీసులు ఇవ్వకుండా ఆస్తి పన్ను చెల్లించాలని ఇంటి యజమానులకు నిరంతరం ఫోన్ చేస్తూనే ఉంటారు. ఇంటికి వచ్చి వస్తారు. పన్ను చెల్లించే ఇంటి యజమానులు కార్పొరేషన్ కార్యాలయానికి గాని, ఆయా పరిధిలో సచివాలయానికి గాని వెళితే అసెస్మెంట్ నెంబర్ చెబితే కంప్యూటర్ చూసి ఇంత చెల్లించాలని చెప్పడం జరుగుతుంది. గతంలో డిమాండ్ నోటీసు ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. ఆస్తి విలువ ఆధారంగా పన్ను చెల్లించే విధానం వచ్చినప్పటి నుండి ప్రతి సంవత్సరం 15% పెరుగుతూనే ఉంది. గత ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఆస్తి పన్ను విలువ ఆధారంగా చెల్లించే విధానాన్ని రద్దు చేస్తామని ప్రకటనలు చేయడం జరిగింది. అయితే అందుకు భిన్నంగా ఆ విధానాన్ని రద్దు చేయకుండా కొనసాగించడం పట్ల ఇంటి పన్ను చెల్లించే ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం మారిందే తప్ప, విధానాలు మారలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఆస్తి విలువ ఆధారంగా పన్ను విధానాన్ని రద్దు చేయాలని ప్రజల కోరుతున్నారు. అదేవిధంగా ప్రజలనుండి వసూలు చేసిన విధంగానే ప్రభుత్వ కార్యాలయం నుండి కూడా వస్తువులు చేయాలని కోరుతున్నారు. వారికి ఒక న్యాయం, ప్రజలకు ఒక న్యాయమా అని ప్రశ్నిస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

ప్రజాశక్తి - తాడేపల్లి



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తుంటే కఠిచర్యలు తీసుకుంటామని తాడేపల్లి ఎస్ఐ ఎస్.కె.ఖాజావలి హెచ్చరించారు. బుధవారం డ్రోన్ కెమెరాలు ఆధారంగా విజయవాడ క్లబ్ పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా చెట్ల కింద మద్యం చేయిస్తున్న వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించేశారు. మరోసారి ఇలా పోలీసులు దృష్టికొస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి రహదారులపై ప్రమాదాల కారణమవుతున్నారని మందు బాబులను హెచ్చరించారు.



యోగా మంచిదే

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రతిరోజు యోగా చేయటం వల్ల మనిషి శరీరానికి మంచి జరుగుతుందని నేతాజీ బాలవిద్యాలయం ప్రధానోపాధ్యాయులు శ్రీహరినాథ్ తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గని మాట్లాడారు. ఉరుకులు పరుగుల ప్రపంచంలో మనిషి ఒత్తిడి గురవుతున్నారని చెప్పారు. ఒత్తిడి నుండి బయటపడాలన్న, ప్రశాంతతకావాలన్నా యోగ చేయాలని కోరారు. కార్యక్రమంలో సుందరయ్య నగర్, మహానాడులోని పలువురు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు



అవగాహన కల్పిస్తున్న శస్త్రవేత్తలు

వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు బుధవారం నారాకోడూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం గుంటూరు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ సైంటిస్ట్ శాస్త్రవేత్త డాక్టర్ సి.హెచ్. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఐసిఏఆర్చ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వ్యవసాయ వ్యయం తగ్గించే మార్గాల గురించి కార్యక్రమంలో రైతులకు వివరించారు. వైరస్ వ్యాధుల గురించి వాటి నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ రవిచంద్రన్ పామ్ ఆయిల్ పంటపై కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు గురించి నూనె గింజల పెంపకాల ఆవశ్యకత గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు మరియు అర్హతల గురించి వివరించారు. మిర్చియార్డు మాజీ డైరెక్టర్ బి.జ్యోతి కుమార్, ఉద్యాన శాఖ అధికారి మహి , గ్రామ రైతు సంఘం ప్రెసిడెంట్ వి సాంబశివరావు, వి ఏ ఓ శివ, ఆర్ వై ఎస్ ఎస్ రైతులు , వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమంతో కూడిన అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పెదకాకాని

సంక్షేమంతో కూడిన అభివఅద్ధి కావాలి అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు తీర్పు ఇచ్చి నేటికీ సంవత్సరకాలం అవుతుంది అని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ అన్నారు. బుధవారం పెదకాకానిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వ నాయకులు మాట్లాడారు ఈ సంవత్సర కాలంలో పొన్నూరు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. అందులో భాగంగా పెదకాకాని మండలంలో గోకులం షెడ్లు,సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం,రోడ్ల నిర్మాణం,పేదలకు వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు ఇలా అనేక అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. గుంటూరు పార్లమెంట్ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్,నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అనునిత్యం మండలంలో జరుగుతున్న అభివఅద్ధిపై సమీక్ష సమావేశాలు జరుపుతున్నారని ఇది ప్రజా రంజక ప్రభుత్వం అని అన్నారు ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.







మంగళగిరి, పొన్నూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, తెనాలిలో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్సిపి మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ డి.వేమారెడ్డి అన్నారు. బుధవారం మంగళగిరి నియోజకవర్గ వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్త బస్టాండ్ సెంటర్ నుండి తాసిల్దార్ కార్యాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పచ్చల రత్నకుమారి, ఈదులుమూడి డేవిడ్ రాజ్, దామర్ల కుబేర స్వామి,అహ్మద్ బాజీ షాహిద్, ఊట్ల పాల శ్రీనివాసరావు, మేడ వెంకటేశ్వరరావు దుగ్గిరాల జడ్పిటిసి దాసరి అరుణ కుమారి, మంగళగిరి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, తాడేపల్లి, పట్టణ రూరల్ అధ్యక్షులు, బుర్ర ముక్కు వేణుగోపాల్ స్వామి రెడ్డి, అమరా వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు

వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శీకృష్ణ పొన్నూరులో ఘనంగా నిరసన ర్యాలీ జరిగింది. నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. అనంతరం ఇన్‌చార్జి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలోచ మండల పార్టీ నాయకుల, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

కూటమి ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం 'వెన్నుపోటు దినం' పేరిట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక, జడ్పిటిసి పిల్లి ఉమాప్రణతి, కౌన్సిలర్లు కుర్ర సుజాత, యశోద, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వం వచ్చాక హామీల అమలు పక్కన పెట్టీ దాడులు దౌర్జన్యాలు చేస్తుంది అని ప్రత్తిపాడు నియోజక వర్గ ఇంచార్జ్ బాలసాని కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం వెన్నుపోటు దినం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ జికరుణకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలసాని కిరణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల కన్వీనర్ చల్ల హనుమంతు యాదవ్,వట్టి చెరుకూరు మండల కన్వీనర్ మన్నవ వీర నారాయణ, పెదనందిపాడు మండల కన్వీనర్ షేక్ ఖాశిం పీర, గుంటూరు రూరల్ మండల కన్వీనర్ పి.శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపిలు నాయకులు పాల్గొన్నారు.



దాతల నుండి గ్రేట్లు అందుకుంటున్న ఆలయ సిబ్బంది

ఆలయానికి క్యూలైన్లు విరాళం

ప్రజాశక్తి - పెదకాకాని

శివాలయంలో ఉత్సవాలు జరిగేటప్పుడు భక్తుల రద్దీ దఅశ్య తోపులాటలు జరగకూడదని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గని ఆత్కూరు గ్రామానికి చెందిన పాములపాటి రవి మణికంఠ సునయన దంపతులు వారి కుమారుడు హిమాన్షుతో కలిసి జింక్ పైపులతో చేసిన 25 భారీ గేట్లు బుధవారం ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివఅద్ధికి, నిత్య అన్నదాన పథకమునకు భక్తులు విరివిగా విరాళము సమర్పించి ఆలయ అభివఅద్ధికి సహకరించ వలసిందిగా ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేసినారు.

నేడు మధురకవి నూతక్కి అబ్రహం వర్ధంతి

ప్రజాశక్తి - తెనాలి



మధురకవి నూతక్కి అబ్రహం వర్ధంతి గురువారం నిర్వహిస్తున్న కుటుంబసభ్యులో ఒక ప్రకటనలో తెలిపారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అక్షర వారసులు, మధురకవి నూతక్కి అబ్రహాం తన రచనలలో సామాజిక విషయాలను ఇతివృత్తాలుగా మార్చి ప్రజా చైతన్యం కోసం పాటుపడ్డారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామములో 1923 మార్చి 7న నూతక్కి దానియేలు, కాటమ్మ దంపతులకు జన్మించిన అబ్రహాం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువాకు ప్రియ శిష్యుడుగా పేరొందారని తెలిపారు. ఆయన రచనల్లో మత్కుణం, జలరుహాక్షి, పావురం, పరిపూర్ణుడు, కుల వ్యవస్థ కావ్యాలు ప్రాచుర్యం పొందాయన్నారు.



విరాళం అందజేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి కొమ్మారెడ్డి కిరణ్ విరాళం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామం అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీకి , తెలుగుదేశం తాడేపల్లి మండలం మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ తన సొంత నిధులు 11116 (ఒక లక్ష, వెయ్యి, నూట పదహారు రూపాయలు)ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చిర్రావూరు గ్రామ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ కొమ్మారెడ్డి కిరణ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి చిర్రావూరు గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు బెజ్జం రామకృష్ణారావు, నాయకులు మక్కపాటి ఏసు ప్రసాద్ కూరపాటి సంపూర్ణ రావు, మానేపల్లి కిరణ్, బూత్ కన్వీనర్ జెట్టి రవి, కొంకా ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా మంత్రి లోకేష్

ప్రజాశక్తి- తాడేపల్లి

నియోజకవర్గంలో పేద, బడుగు బలహీన వర్గాల వారికి రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా సహాయ సహకారాలు అంద చేస్తూ అండగా ఉంటున్నారని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో తాడేపల్లి 3వ వార్డుకు చెందిన ఉయ్యాల కోటేశ్వరికి తోపుడు బండి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్ బాషా, 3వ వార్డు అధ్యక్షులు వనమా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ విద్యార్థిని త్రివేణికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



త్రివేణికి పిహెచ్‌డి పట్టా అందచేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య, అధ్యాపకులు

వడ్లమూడి, విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం విద్యార్థిని బత్తెన త్రివేణికి బుధవారం విజ్ఞాన్స్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. త్రివేణి 'సమ్ ప్రాబ్లమ్స్ ఆన్ కన్వెక్టివ్ బౌండరీ లేయర్ ఫ్లో ఆఫ్ నాన్ న్యుటోనియన్ ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ట్రెచ్చింగ్ షీట్' అనే అంశంపై పరిశోధన చేసిందని తెలియ జేశారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమ్యాటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మునగాల వెంకట సుబ్బారావు గైడ్‌గా వ్యవహ రించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా త్రివేణికి విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి మేయర్ నివాళి

ప్రజాశక్తి-గుంటూరు



నివాళి కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, కళాదర్బార్ సభ్యులు

ఎంతోమంది ప్రజల అభిమానం పొందిన గాన గంధర్వుడు యస్.పి బాలసుబ్రహ్మణ్యం చిరస్మరనీయుడని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బుధవారం ఆయన 79వ జయంతిని పురస్కరించుకొని నాజ్ సెంటర్ సర్కిల్‌లో ఉన్న బాలసుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద కళాదర్బార్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకలలో పాల్గొని ఆయని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తన గాన మాధుర్యంతో ఎంతో మంది ప్రజల అభిమానాన్ని పొందారని, అటువంటి వారి స్మృతులు ప్రజలు ఎప్పటికి మర్చిపోకూడదన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం భారత దేశంలోని అన్ని భాషలలో పాటలు పాడారని, ఏ భాషలో పాట పాడినా ఆ బాషకు చెందిన వ్యక్తిగా పాడేవారన్నారు. ఆయన తెలుగు వారు కావటం అందరం గర్వించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో కళాదర్బార్ అధ్యక్షులు పొత్తూరు రంగారావు, సభ్యులు ఇక్కుర్తి భాను ప్రకాష్, వేణుగోపాల్, బాబురావు, అబ్దుల్ ఖాదర్, నరసింహారావు, రాధారాణి, అన్నపూర్ణ, సత్తార్ అభిమానులు పాల్గొన్నారు.

ఆధునిక తెలుగు కవిత్వానికి చుక్కాని మహాప్రస్థానం

ప్రజాశక్తి-గుంటూరు



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అవగాహన సభ్యులు

ఆధునిక తెలుగు కవిత్వంలో మహాప్రస్థానం స్థానం చారిత్రాత్మకమైనదని కవులు, సాహితీ వేత్తలు అన్నారు. 'మహాప్రస్థానం' ప్రచురించి 75 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా స్థానిక అరండల్‌పేట అవగాహన కార్యాలయంలో జరిగిన కార్యక్రమ ంలో విశాలాంధ్ర మాజీ జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ 1933-47 సంవత్సరాల మధ్య కాలం నాటి మాదిగ సామాజిక పరిస్థితులే మహా ప్రస్థానం గేయాలుగా శ్రీశ్రీ కలం నుండి పుట్టుకొచ్చాయన్నారు. 1950 జూన్‌లో వచ్చిన మహా ప్రస్థానం దాదాపు నలభై సార్లు ప్రచురింపబడిందని, కనీసం లక్ష ప్రతుల దాకా అచ్చుయిందని, పాకెట్ సైజు నుండి దినపత్రిక సైజు దాకా శ్రీశ్రీ చేతిరాతతో ఆయన పఠనంతోనూ మహా ప్రస్థానం ప్రజల్లోకి వచ్చిందన్నారు. ఇంత చరిత్ర కలిగిన మహా ప్రస్థానం గత డెబ్భై ఐదేళ్ల ఆధునిక తెలుగు కవిత్వానికి చుక్కానిగా నిలిచిందన్నారు. శ్రీశ్రీతో తనకున్న పరిచయం, అనుభూతి ఎప్పటికీ మర్చిపోలేనిదన్నారు. పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ మహాప్రస్థానం కవితలు తెలుగు సమాజంలో ప్రకంపనలు సష్టించిందని, అభ్యుదయ కవిత్వానికి బలమైన పునాది వేసిందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఇంజనీర్ ఎన్.సదాశివం, కవులు భాగ్యలక్ష్మి, జమదగ్ని, గాయకులు రాజశేఖర్ మహా ప్రస్థానం గేయాలను ఆలాపించారు.

గిరిజనుల కోసం రాఘవయ్య పంతులు అవిశ్రాంత పోరాటం

ప్రజాశక్తి-గుంటూరు


రాఘవయ్య పంతులు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మేయర్, స్థెద్వా, ఇతర సంస్థల నాయకులు

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య పంతులు 128వ జయంతి సందర్భంగా షెడ్యూల్డ్ ట్రైబ్ యానాది డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థెడ్వా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నాజ్ సెంటర్‌లోని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో రాఘవయ్య పంతులు విగ్రహానికి గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాఘవయ్య పంతులు గిరిజనుల హక్కుల సాధనకు, సంక్షేమానికి , గిరిజన హక్కులు హరించే సిటి యాక్ట్ రద్దుకు విశ్రాంతంగా పాటుపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థెడ్వా అధ్యక్షులు బాపట్ల ఏసుబాబు, కస్తూరి సైదులు, అంగిరేకుల వరప్రసాద్, వబ్బాని ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను ప్రారంభించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-గుంటూరు



హాస్టల్‌ను సందర్శించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను వెంటనే ప్రారంభించి, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం స్థానిక బిఆర్ స్టేడియం వద్ద ఉన్న కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ హాస్టల్ భవనం నిర్మాణం పూర్తి అయినా ఇంత వరకూ ప్రారంభించలేదన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల పోరాట ఫలితంగా గత డిసెంబర్‌లో ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినా నేటికీ అందుబాటులోకి రాలేదన్నారు. మరో వారం రోజుల్లో విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుందన్నారు. హాస్టల్ విద్యార్థులు భవనాలు లేక అనేక అద్దె భవనాల్లో ఉంటున్నారన్నారు. ఎస్సీ, బీసీలకు సంబంధించి వందలాదిమంది చదువుకోవాల్సిన కోడిగుడ్డు సత్రం హాస్టల్ ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచటం సరికాదన్నారు. భవన నిర్మాణం మొత్తం పూర్తి అయినా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్ట్ వద్దనుండి అధికారులకు హాస్టల్‌ను అప్పచెప్పలేదని తెలిసిందన్నారు. ఈ కారణం చూపి విద్యార్థులకు వసతి కల్పించే భవనంపై తాత్సారం చేయటం సరికాదన్నారు. వెంటనే హాస్టల్ భవనాన్ని ప్రారంభించాలని, డిమాండ్ చేశారు. హాస్టల్ భవనాన్ని సందర్శించిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఎ.యశ్వంత్, ఉపాధ్యక్షులు సుభాని, బి.రాకేష్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జర్నలిస్టు క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు


విజేతకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జేసాప్) ఆధ్వర్యంలో గుంటూరు పోలీసు పెరేడ్‌గ్రౌండ్, జెకెసి కాలేజి గ్రౌండ్‌లో మూడ్రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. బుధవారం సెమిఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. సెమిఫైనల్‌లో పశ్చిమ గోదావరి టీమ్ 16 ఓవర్లలో 103 పరుగులు చేయగా వారిపై చిత్తూరు టీం 13.4 ఓవర్లలో 108 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో సెమీఫైనల్‌లో కడప టీం 12 ఓవర్లకు 140 పరుగులు చేయగా, శ్రీకాకుళం జట్టు 12 ఓవర్లకు 102 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఫైనల్‌లో కడప, చిత్తురు జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు 16 ఓవర్లలో 169 పరుగులు చేసింది, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తురూ టీం 16 ఓవర్లకు 135 పరుగులు చేసి ఓటమి పాలైంది. కడప టీం టైటిల్ ను గెలిచింది. విజేతలకు, రన్నర్స్‌కు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఇటువంటి క్రీడా పోటీలు వల్ల శారీరక దేహధారుడ్యము, మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. జర్నలిస్టులకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశశ్వి కిమ్స్ శిఖర హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్స్ డాక్టర్ జయకిషన్, స్పోర్ట్స్ ఇంజ్యూరి స్పెషలిస్ట్ డాక్టర్ సాయి కృష్ణ , భాష్యం కిరీటీ జేసాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, టోర్నమెంట్ నిర్వాహకులు పుల్లంశెట్టి ఉదయ్‌కుమార్, జేసాప్ నాయకులు పాల్గొన్నారు.

పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా లింగంశెట్టి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా మాజీ శాసనసభ్యులు, పార్టీ సీనియర్ నేత లింగంశెట్టి ఈశ్వరరావు నియమితులయ్యారు. ఆమంచి కష్ణమోహన్, షేక్ మస్తాన్ వలీ, మెరజోతు సూర్యనాయక్, ఉడతా వెంకటరావు యాదవ్, సయ్యద్ జవీద్ అన్వర్, అరిగెల అరుణ కుమారి సభ్యులుగా నియమితులయ్యారు. ఈమేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడు కె.సి.వేణుగోపాల్ బుధ వారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్ గా నియమితులైన లింగంశెట్టి ఈశ్వరరావు 1978 - 82 మధ్యకాలంలో గుంటూరు-1 శాసనస భ్యునిగా, ప్రభుత్వ విప్ గా సేవలందించారు. ఆపై నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేశారు.





యోగా ప్రయోజనాలపై విస్తృత అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

శరీరానికి సమతుల్యతతోపాటు దఢత్వం అందించే యోగాపై యోగాంధ్ర 2025 ద్వారా ప్రజలకు విస్తత స్థాయిలో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. బుధవారం స్థానిక బందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం ఎదురు యోగా రోడ్డులో జిఎంసి, ఆయుష్ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర 2025 యోగాసనాల శిక్షణ, అవగాహన కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర మేయర్ కోవెలమూఇ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, పాల్గొన్నారు. యోగా మాస్టర్ ట్రైనర్ యోగ ప్రోటోకాల్ ప్రకారం సూక్ష్మ వ్యాయామంతో పాటు ఆసనాల ప్రయోజనాలు వివరిస్తూ జిల్లా ఇన్చార్జి కలెక్టర్, ఎమ్మెల్యే మేమేయర్, కమిషనర్, ఇతర జిల్లా అధికారులు, ప్రజలతో వివిధ రకాల యోగాసనాలు చేయించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి యోగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ జూన్ 21వ తేదీ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై అవగాహన కోసం యోగాంధ్రా 2025 కార్యక్రమాలు నెల రోజులు పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. గళ్లా మాధవి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా, వ్యాయామం చేయటం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా ప్రతి ఒక్కరు జీవన విధానంలో భాగం కావాలన్నారు. యోగా వలన మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో మెగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆర్ట్ ఆఫ్ నటరాజ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యాసంస్థల విద్యార్థులు నత్య రూపకంలో యోగాసనాలు ప్రదర్శించారు.కార్యక్రమంలో డిఆర్ఓ ఎన్ఎస్‌కె.ఖాజావలి, నగర అదనపు కమిషనర్ ఓబులేసు, ఆయుష్ జిల్లా ఆయుష్ అధికారి అనిత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక దృఢత్వం :ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

యోగాతో శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వం, మంచి ఆలోచనా సామర్థ్యం మెరుగుపడతాయని జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన యోగా అభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యోగా, ధ్యానం అనేవి శారీరకంగా, మానసికంగా మనిషి యొక్క స్థితిగతులను మార్చగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయన్నారు. అదనపు ఎస్‌పి హనుమంతు, డిఎస్‌పి ఏడుకొండలు, సిఐ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.